



కంటి

కంటి

వాడె వాడె

ఘనమైన

ముత్యాల

కంటమాలలవే

పతకములు

నవేమింటి

పొడవైనట్టి

మించు

కిరీటంబదే

జంటల

వెలుగు

శంఖు

చక్రాలవే...

- అన్నమయ్య

# ఏడుకొండలస్వామి నే బంగారు స్వామి!

ఏడుకొండల స్వామి- ఏడేడు లోకాలస్వామి! ఏంవి అడిగినా, ఎక్కణ్ణుంచి అడిగినా యిచ్చేటిస్వామి, వరములిచ్చేటి స్వామి.

వరహామూర్తిని చోటివ్వమని అడిగాడు. కొండంత వ్యాపించి ఉన్నాడు. మాటతప్పే స్వామికాదు. మర్యాదకల స్వామి. కృజ్ఞతకు రాముడే! స్థలదాత వరాహాస్వామిని దర్శించే తన్ను దర్శించమన్నాడు. కొండంత మనసున్న స్వామి కోనేటి ప్రక్కనే కొలువై ఉన్నాడు. కేశములిచ్చినవారి క్లేశములు బాపె స్వామి! ఆ పాద మస్తకమూ బంగారమే! ఆయన మనస్సు బంగారమే!

ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన దేవుడు శ్రీవెంకటేశ్వరుడు. వెలకట్టలేని సంపద ఆయన సొంతం. నిరుపేద కూలి మొదలు అంబానీల దాకా భక్తితో స్వామికి సమర్పించుకునే కానుకల విలువ వేల కోట్లు. ఆయనకు లేని ఆభరణం లేదు. పచ్చలు, పతకాలు, కెంపులు, వజ్రవైఢూర్యాలు, ముత్యాలహారాలు.. స్వామి స్పర్శతో పునీతమవుతాయి. 1500 యేళ్ల కిందటి నుంచే వెంకన్నకు ఆభరణలు సమకూరుతన్నాయి. మూలవర్లకు, ఉత్సవ మూర్తులకు అలంకరిస్తున్న ఆభరణాలు లెక్కకు మిక్కిలి ఉన్నాయి. బ్యాంకుల్లో టన్నుల కొద్దీ బంగారం నిల్వలలున్నాయి. మింట్‌లో బంగారం పేరుకు పోతోంది. స్వామి బంగారం లెక్కలు భద్రతా రీత్యా రహస్యమే అయినా, ఒక అంచనా ప్రకారం శ్రీవెంకటేశ్వరుని ఆభరణాల విలువ 5000 కోట్లు ఉండవచ్చు. రాజుల మొదలు పేదల దాకా స్వామికి సమర్పించిన ఆభరణాల్లో కొన్నింటిని తిరుమల తిరుపతి దేవస్థానం అమృతోత్సవాల సందర్భంగా ప్రదర్శనకు పెట్టాలని నిర్ణయించింది. అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేసింది. స్వామి ఆభరణాల తొలి ప్రదర్శన ఇది. వేల కోట్ల విలువచేసే అపురూపమైన ఆభరణాలను ఈ ప్రదర్శనలో నేరుగా తిలకించే అవకాశం కలుగుతుందని భక్తులు ఆశపడ్డారు. రాష్ట్రపతి దీనిని ప్రారంభించాల్సి ఉండగా భద్రతాకారణాలవల్ల ప్రదర్శన రద్దుచేసినట్లు శనివారం రాత్రి అప్పుడు టి.టి.డి. ప్రకటించింది. దీంతో భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే భక్తులకు కనువిందు చేసేలా స్వామి ఆభరణాలలో కొన్నింటిని 'ప్రముఖాంధ్ర' పాఠకులకోసం ఇక్కడ సచిత్రంగా సమర్పిస్తున్నాం.

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసునికి విలువకట్టలేని అపురూపమైన ఆభరణాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో నుంచి ఎంపిక చేసిన ఆభరణాలను ఒక పద్ధతి ప్రకారం శ్రీవారికి అలంకరింప చేస్తుంటారు. ప్రతి శుక్రవార అభిషేక సేవ అనంతరం ఆభరణాలను మూలవిరాట్టుకు అలంకరింపచేస్తారు. దీనిని సమర్పణ అంటారు. మరుసటి గురువారం తెల్లవారుజామున ఆ ఆభరణాలను తొలగంచి నేత్ర దర్శనానికి సిద్ధం చేస్తారు. దీనిని సల్లింపు అంటారు. శతాబ్దాల కాలంలో ఒకే విధమైన ఆభరణాలు అనేకం శ్రీవారికి సమకూరాయి. ఉదాహరణకు కిరీటాలు, శంఖుచక్రాలు అనేకం ఉన్నాయి. అయితే శ్రీవారికి అలంకరించేందుకు శిరోభాగం నుండి పాదాల వరకు నిర్ణీత ఆభరణాలతో కూడిన మూడు సెట్ల నగలను సాధారణంగా వినియోగిస్తుంటారు. క్రీశ 500 - 1000 సంవత్సరాల మధ్య కాలంలో అప్పటి పాలకులు, భక్తులు సమర్పించిన పలు ఆభరణాలు ఇప్పుడు బాగా పాతబడ్డాయి. చాలా కాలం పాటు పుష్పాలంకరణల తాలూకు తేమ ప్రభావంతో జీర్ణావస్థకు చేరుకున్న అప్పటి ఆభరణాలలో కొన్నింటిని ఇప్పుడు స్వామివారికి అలంకరించడం లేదు. స్వామివారికి ఆకాశరాజు సమర్పించిన కిరీటం, కంచిస్వామి కిరీటం, నవరత్న కిరీటం, వివిధ జతల శంఖుచక్రాలు, కౌస్తుభం, వైజయంతిమాల, లక్ష్మీహారం, సహస్రనామ హారాలు స్వామి అలంకరణలో ముఖ్యమైనవి. పాండ్య, చోళరాజులు, శ్రీకృష్ణదేవరాయలు, మైసూరు, ఇతర ప్రాంతాల ప్రభువులు. గద్వాల రాణి, వెంకటగిరి జమీందార్లు, బ్రిటీష్ పాలకులు, మొగలాయిలు, మహంతులు స్వామివారికి అనేక నగలు సమర్పించారు. శ్రీవారి మూలవిరాట్టుకు అలంకరించే సాలగ్రామ హారం, అమ్మవార్ల మంగళసూత్రాలు మినహా ఇతర ఆభరణాలు వేటినైనా ప్రదర్శనకు ఉంచవచ్చని ఆగమపండితులు అనుమతించడంతో దాదాపు 300 ఆభరణాలను ప్రదర్శనలో ఉంచేందుకు టిటీడి ఏర్పాట్లు చేసుకున్నా ఆఖరి క్షణంలో అప్పుడు రద్దు చేసింది. అందుకే ఇప్పుడు దర్శించే అవకాశం కల్గించడం మీ మా అదృష్టం.





